నమస్తే తెలంగాణ
# జనగామ
5 | వరంగల్, బుధవారం 25 జూన్ 2025 | JANAGAON

**పాలకుర్తి పర్యాటక సర్కిల్ అభివృద్ధి పనులు పడకేశాయి.** పాల్కూరికి సోమనాథుడు, బమ్మెర పోతన వంటి ప్రముఖ కవుల జన్మస్థలం కావడంతో ఇక్కడ పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. అప్పటి సీఎం కేసీఆర్ పోతనా మాత్యుడి సమాధిని సందర్శించి నిధులు మంజూరు చేశారు. ఆ తర్వాత పనులు శరవేగంగా కొనసాగాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దీంతో ఏడాదిన్నరగా పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా పర్యాటక పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని సాహితీ ప్రియులు కోరుతున్నారు. – పాలకుర్తి, జూన్ 24



బమ్మెరలో అసంపూర్తిగా పర్యాటక పనులు

# పడకేసిన పర్యాటకం

- బమ్మెర, పాలకుర్తి, వల్మిడిలో నిలిచిన అభివృద్ధి పనులు
- ఏడాదిన్నరగా ముందుకు సాగని వైనం
- కాంగ్రెస్ సర్కారు నిర్వాకంతో బిల్లులు రాక చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- త్వరగా పూర్తి చేయాలని కోరుతున్న సాహితీ ప్రియులు

ఏప్రిల్ 27, 2017లో సీఎం కేసీఆర్ బమ్మెర పోతనామాత్యుడి సమాధిని సందర్శించి పాలకుర్తి సోమనాథుడికి రూ.10 కోట్లు, పోతన స్మారక మందిరానికి రూ.7.50 కోట్లు, వల్మిడి ఆలయ అభివృద్ధికి రూ. 5 కోట్లు మంజూరు చేశారు. బమ్మెరలో పాలకుర్తి, వల్మిడి, బమ్మెర పర్యాటక అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఆనంతరం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో పర్యాటక పనులు శరవేగంగా ముందుకు సాగాయి. రూ. 2.5 కోట్ల వ్యయంతో బమ్మెరలో మహాకవి పోతన 22 ఫీట్ల కాంస్య విగ్రహాన్ని రాజమహేంద్రవరం నుంచి తెప్పించి ప్రతిష్ఠించారు. టూరిజం ప్యాకేజీలో భాగంగా బమ్మెర పర్యాటక అభివృద్ధికి కేటాయించిన రూ. 7.50 కోట్ల పనులు ఏడాదిగా నిలిచిపోయాయి. నిధులున్నా పనులు ముందుకు సాగడం లేదు. గతంలో మంజూరైన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని విడుదల చేయకపోవడంతో సం బంధిత కాంట్రాక్టు సంస్థ పనులు చేయలేమని చేతులెత్తేసింది. నవంబర్ 20న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పోతన అభివృద్ధి పనులు పరిశీలించి అధికారులతో సమీక్షించి పనులు పూర్తి చేస్తామని ప్రకటించినా ఇప్పటి వరకు అడుగు ముందుకు పడలేదు. బిల్లులు చెల్లిస్తానని కలెక్టర్ చెప్పినా కాంట్రాక్టర్ పనులు చేయలేనని చేతులెత్తేశాడు. పోతన సమాధి, పోతన మోట తోలిన బావి, లక్కమాంబ వాగు(కాల్వ), విద్యుత్, టైల్స్, ప్లాస్టింగ్, గార్డెన్ (గ్రీనరీ), ఓపెన్ థియేటర్, పార్కింగ్, ఆర్చి గేట్లు, 22 ఫీట్ల ఎత్తున పోతన కాంస్య విగ్రహానికి తుది మెరుగులు దిద్దడం, ఆర్ట్స్, క్రాఫ్ట్ భవనాల పనులు ఇంకా పూర్తి చేయాల్సి ఉంది. పనులు పూర్తికాకపోవడం తో స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కోణంలో పనులను పక్కనబెట్టిందని స్థానికులు మండిపడుతున్నారు.

పూర్తికాని పోతన ఆడిటోరియం ప్రేక్షకుల గ్యాలరీ పనులు



## ఎమ్మెల్యే నిర్లక్ష్యంతోనే ఆగిన పనులు



పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి నిర్లక్ష్యం, అసమర్థతతోనే బమ్మెర పర్యాటక పనులు ఆగినయ్. కలెక్టర్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే పలుమార్లు సమీక్షలు నిర్వహించినా కాంగ్రెస్ ప్రభుత్వంలో బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్ చేతులెత్తేశా డు. ఎర్రబెల్లి దయాకర్‌రావు మంత్రిగా ఉన్నప్పుడు పనులు చురుగ్గా సాగాయి. తక్షణమే ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు స్పందించి పర్యాటక పనులు పూర్తి చేయాలి.

– జోగు గోపి, బమ్మెర గ్రామస్తుడు

## రేపు కాళోజీ కళాక్షేత్రంలో రుక్మిణీ కల్యాణం పద్య నాటకం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న హరికృష్ణ


పోచమ్మమైదాన్, జూన్ 24 : తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో స్టేషన్‌ఘన్‌పూర్ వేణుగోపాలస్వామి నాట్య మండలి ఆధ్వర్యంలో రుక్మిణీ కల్యాణం పౌరాణిక పద్య నాటకా న్ని హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో ఈనెల 26న ప్రదర్శించనున్నారు. ఇందుకు సం బంధించిన పోస్టర్లను హైదరాబాద్ రవీంద్రభారతి ప్రాంగణంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేణుగోపాలస్వామి నాట్యమండలి అధ్యక్షుడు చెరుకు పాపయ్య, జనగామ జిల్లా నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు అక్కెనపల్లి రవీందర్, నాటక దర్శకుడు మాలి విజయ్‌రాజ్, కళాకారులు క్యాతం రాజ్‌కుమార్ శాస్త్రి, పేరిణి విజయ్‌కుమార్ పాల్గొన్నారు. నాటకాన్ని వీక్షించేందుకు కళాకారులు, ప్రజలు, నాటక ప్రియులు, కళా పోషకులు అధిక సంఖ్యలో తరలిరావాలని రవీందర్ కోరారు.

## త్వరలో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలు

- ఏర్పాట్లు పూర్తి చేస్తున్న అధికార యంత్రాంగం
- ఫలితాలపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో గుబులు
- ప్రభుత్వ వ్యతిరేకత, అభివృద్ధి లేమిపై ఆందోళన







# ఎమ్మెల్యేలకు లోకల్ టెన్షన్

***కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఎన్నికల టెన్షన్ పట్టుకున్నది. ఎప్పటికప్పుడూ వాయిదా పడుతూ వస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలు హైకోర్టు ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించేందుకు అవకాశం ఉన్నది. అయితే అంతంత మాత్రంగానే అమలవుతున్న సంక్షేమ పథకాల, చెప్పకోలేనంత అభివృద్ధి లేకపోవడం, అంతకుమించి ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ఎటుదారి తీస్తుందేమోననే భయం వారిలో కనిపిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఏడాన్నర గడుస్తున్నా తమ నియోజకవర్గాల్లో గత బీఆర్ఎస్ సర్కారు చేసిన అభివృద్ధి తప్ప.. తాము చేసిన, చెప్పకోదగ్గ పనులేవీ లేకపోవడంతో ప్రజాతీర్పు ప్రతికూల ఫలితాలనిస్తుందేమోనని తలల పట్టుకుంటున్నట్లు తెలుస్తోంది.***

*– వరంగల్, జూన్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఆరు జిల్లాల్లో కలిపి 1,702 గ్రామ పంచాయతీలు, 775 ఎంపీటీసీ, 75 జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. జూలైలో ఎన్నికల ప్రక్రియ మొదలుపెట్టి, ఆగస్టులో నిర్వహించే అవకాశం ఉన్నదని అధికార వర్గాలు చెబుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలనగానే అధికార పార్టీ ఎమ్మెల్యేలలో ఆందోళన పెరుగున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదు. గ్రామ పంచాయతీల పాలకవర్గాల గడువు ముగియడంతో అప్పటివరకు పక్కాగా ఉన్న పారిశుధ్య నిర్వహణ సైతం అధ్వాన్నంగా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన శ్మశానవాటికలు, డంపింగ్ యార్డుల నిర్వహణ ఎక్కువ గ్రామాల్లో సరిగా లేదు. ట్రాక్టర్లను మూలన పడేశారు. అధికార యంత్రాంగం ప్రణాళిక లేకపోవడంతో ఉపాధి హామీ పనులు సరిగా సాగడం లేదు. గత ప్రభుత్వంతో పోల్చితే గ్రామాల్లో అభివృద్ధి పనుల పరంగా ప్రతికూలతలే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఎన్నికలు అనగానే అధికార పార్టీ ఎమ్మెల్యేలు టెన్షన్ పడుతున్నారు.

### గ్రామీణ స్థానిక సంస్థల స్థానాలు

| జిల్లా | సర్పంచ్ | ఎంపీటీసీ | జడ్పీటీసీ | ఓటర్లు |
|---|---|---|---|---|
| వరంగల్ | 317 | 130 | 11 | 3,85,163 |
| హనుమకొండ | 210 | 129 | 12 | 3,65,832 |
| మహబూబాబాద్ | 482 | 193 | 18 | 5,52,192 |
| జనగామ | 281 | 134 | 12 | 4,01,115 |
| జయశంకర్ భూపాలపల్లి | 241 | 106 | 12 | 2,90,663 |
| ములుగు | 171 | 83 | 10 | 2,31,052 |

### కానరాని సంక్షేమం

ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు జరగడం లేదు. పేదల సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అదనంగా ఒక్క పథకాన్ని మొదలు పెట్టలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాల నిర్వహణలోనూ కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. అర్హులకు కొత్త రేషన్ కార్డుల జారీ అయోమయంగా ఉంటున్నది. రేషన్ కార్డు జారీ అయ్యిందని చెబుతున్న అధికారులు నెలవారీగా ఇచ్చే బియ్యం కోటా రాలేదని చెబుతున్నారు. ఆసరా పింఛన్ల మంజూరు ప్రక్రియపై అనేక సందేహాలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు ఒక్కరికి కూడా కొత్తగా సామాజిక పింఛను మంజూరు చేయలేదు. అసెంబ్లీ ఎన్నికల ముందు వయోపరిమితి లేని లక్షల మందికి ఇప్పుడు 65ఏండ్లు నిండాయి. వివిధ కారణాలతో చాలామంది చనిపోయారు. మృతిచెందిన వారి భార్యకు ఇవ్వాల్సిన వితంతు పింఛన్ల మంజూరును ఇంకా మొదలుపెట్టలేదు. అర్హుల్లో కొత్త వారికి సామాజిక పింఛన్లు ఇవ్వకపోగా అసెంబ్లీ ఎన్నికల ముందు పింఛను మొత్తాన్ని పెంచుతామని చెప్పిన హామీ అమలు కావడం లేదు. మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు ప్రతి నెలా రూ.2500 ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఈ హామీని మరచిపోయింది. యువత ఉపాధి కోసం రాజీవ్ యువవికాసం పేరుతో పథకాన్ని పెట్టింది. అందరి నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హులను గుర్తించినా మంజూరు పత్రాలు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నది. రూ.500 గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి పథకాల నిర్వహణ అస్తవ్యస్తంగానే ఉంటున్నది. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద అర్హులను కాకుండా అధికార పార్టీ వారికి, పలుకుబడి ఉన్న వారికీ మంజూరు చేశారని గ్రామాల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. సంక్షేమం అమలు, అభివృద్ధి పనులు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ప్రజల్లో అదే తీరు కనిపిస్తున్నది. ఈ పరిస్థితుల్లో స్థానిక సంస్థలు ఎన్నికలు వస్తే తమకు ఇబ్బందులు తప్పవని అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఆందోళన చెందుతున్నారు.

## రైతు వేదిక ఎదుట నారాయణపురం రైతుల ధర్నా
# మాకెప్పుడు భరోసా?



మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం రైతు వేదిక ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

కేసముద్రం , జూన్ 24 : రైతు భరోసా అందించామని సంబురాలు జరుపుకుంటున్న ప్రభుత్వం.. మాకెప్పుడు ఇస్తుందని మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామ రైతులు ధర్నా చేశారు. తమకు పట్టాపాస్ పుస్తకాలు లేక రైతు భరోసా అందలేదని కేసముద్రంలోని రైతు వేదిక ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ ధరావత్ రవినాయక్ మాట్లాడుతూ ఎంజాయ్‌మెంట్ సర్వే చేసి నెలలు గడుస్తున్నా నేటికీ రైతులకు పట్టా పాస్ పుస్తకాలు రాలేదన్నారు. దీంతో రైతు భరోసా, రైతు బీమా, రుణ మాఫీ, మద్దతు ధర, ఇతర ప్రభుత్వ సబ్సిడీలకు దూరమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలు అందక రైతులు అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్య చేసుకుంటున్నారని అన్నారు. పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చి రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్, రవికుమార్, భాస్కర్, లక్‌పతి, రమేశ్, బాషా, శ్రీను, జాన్, నవీన్, శేఖర్, వెంకన్న, బాలచందర్, రమేశ్, బీమా తదితరులు ఉన్నారు.

# రైతులకు ఏం చేశారని విజయోత్సవాలు?



- స్థానిక ఎన్నికల కోసమే కాంగ్రెస్ డ్రామాలు
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, జూన్ 24 : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రైతు భరోసా పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలాడుతున్నదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. రేవంత్ సర్కార్ రైతు భరోసాను ఎన్నికల భరోసాగా మార్చుకుందని ఎద్దేవా చేశారు. మంగళవారం పెద్ది మాట్లాడుతూ విజయోత్సవాల పేరుతో గత సీజన్ రైతు భరోసా, వడ్ల బోనస్‌ను ప్రభుత్వం ఎగవేసిందన్నారు. 19 నెలలుగా అన్నదాతను అరిగోస పెడుతున్న ప్రభుత్వం వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఎకరాకు రూ. 15 వేలు ఇస్తామని చెప్పి రూ. 12 వేలకు పరిమితం చేయడం రైతులను మోసం చేయడమేనన్నారు. రైతుకు ఏం లాభం చేశారని విజయోత్సవ సంబురాలు చేస్తున్నారో సీఎం సమాధానం చెప్పాలన్నారు. రెండు సీజన్ల భరోసా ఎగ్గొట్టినందుకా? కౌలు రైతులకు ఇవ్వనందుకా? రైతు కూలీలకు ఆత్మీయ భరోసా ఇవ్వకుండా మోసం చేసినందుకా? అని ఆయన ప్రశ్నించారు. రుణమాఫీ చారాణ చేసి బారాణ మందిని కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. అన్ని పంటలకు బోనస్ అని చెప్పి సన్న వడ్లకే పరిమితమయ్యారని, పంట బీమా పేరిట రైతును ఉసురుమనిపించారన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. జనుము, జీలుగ విత్తనాల ధరలు పెంచి రైతులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌ను అటకెక్కించారని, పండుగలా ఉన్న వ్యవసాయాన్ని దండగలా మార్చారని ఆరోపించారు. కాంగ్రెస్ దుర్మార్గ పాలనలో 511మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో ఎలాంటి ఆందోళన లేకుండా ఉన్న రైతులు కాంగ్రెస్ పాలనలో పథకాలు అందక పంట పొలాల్లోనే కుప్ప కూలుతున్నారన్నారు. బీఆర్ఎస్‌ది సంక్షేమ ప్రభుత్వమైతే కాంగ్రెస్‌ది రైతు సంక్షోభ ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ఇప్పటికైనా అమలు చేయాలని పెద్ది డిమాండ్ చేశారు.

## ప్రేమకు అడ్డొస్తున్నదని
# కన్నతల్లినే కడతేర్చ్చి!

**ప్రియుడితో కలిసి హత్య చేసిన కూతురు**

***తన ప్రేమ విషయం తెలిసి మందలించడంతో ఎలాగైనా అడ్డుతొలగించుకోవాలని కన్నతల్లినే కడతేర్చిందో కూతురు. పదో తరగతి చదివే వయస్సులోనే ఇన్‌స్టాలో పరిచయమైన వాడితో ప్రేమలో పడి తల్లి అని కూడా చూడకుండా పక్కా పథకం ప్రకారం దారుణంగా హత్య చేయడం కలకలం రేపింది. ప్రియుడు, అతడి సోదరుడితో కలిసి ఈ ఘాతుకానికి పాల్పడ్డ బాలిక.. ముగ్గురూ మైనర్లే కావడం విస్తుగొల్పుతోంది. ఈ సంఘటన హైదరాబాద్ జీడిమెట్లలో సోమవారం సాయంత్రం జరుగగా మృతురాలు సాంస్కృతిక సారథి కళాకారిణి సట్ల అంజలి(36) స్వగ్రామం ఇనుగుర్తిలో తీవ్ర విషాదం నెలకొంది.***

*– ఇనుగుర్తి, జూన్ 24*

- ఘాతుకానికి పాల్పడ్డ ముగ్గురూ మైనర్లే
- హైదరాబాద్ జీడిమెట్లలో దారుణం..
- స్వగ్రామం ఇనుగుర్తిలో విషాదం



అంజలి(ఫైల్)

మహబూబాబాద్ జిల్లా మండల కేంద్రానికి చెందిన సాంస్కృతిక సారథి కళాకారిణి సట్ల అంజలి(36) తన కూతురు చేతిలో దారుణ హత్యకు గురైన ఘటన మంగళవారం హైదరాబాద్‌లోని జీడిమెట్లలో చోటుచేసుకుంది. అంజలి తెలంగాణ ఉద్యమ సమయంలో ఆటపాటలతో ధూంధాం కార్యక్రమాల్లో పాల్గొని అనేక మందిని చైతన్య పరిచింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. పదో తరగతి చదువుతున్న అంజలి కుమార్తె తేజశ్రీ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన నల్లగొండకు చెందిన శివతో ప్రేమలో పడింది. ఐదు రోజుల క్రితం ప్రియుడితో ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో తల్లి అంజలి పోలీసులకు ఫిర్యాదు చేయగా, ప్రియుడు బాలికను తీసుకెళ్లి అప్పగించాడు. ఈ క్రమంలో కోపం పెంచుకున్న తేజశ్రీ తల్లిని చంపాలని నిర్ణయించుకుంది. సోమవారం సాయంత్రం ప్రియుడు, అతని తమ్ముడు యశ్వంత్‌తో కలిసి పూజ చేస్తున్న అంజలిపై దుప్పటి కప్పి ఊపిరాడకుండా చేశారు. అనంతరం శ్వాస ఆడకుండా మొఖంపై దిండు ఉంచి గొంతు పిసికారు. అనంతరం సుత్తెతో తలపై, నుదిటిపై బలంగా కొట్టి అతి కిరాతకంగా హత్య చేశారు. కన్న కూతురే ప్రియుడితో కలిసి తల్లిని హత్య చేసి ఇంతటి దారుణానికి ఒడిగట్టడంపై ఇనుగుర్తిలో తీవ్ర విషాదం నెలకొంది. తేజశ్రీ, శివ, యశ్వంత్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం రాత్రి మండల కేంద్రానికి చేరుకున్న అంజలి మృతదేహానికి మహబూబాబాద్ జిల్లా డీపీఆర్వో రాజేంద్రప్రసాద్, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు కంబాలపల్లి సత్యనారాయణ, కళాకారులు కొమ్మిరే వెంకన్న, గిద్దె రాంనర్సయ్య, మెరుగు రవీందర్, దర్శనం యుగేంధర్ తదితరులు ఆమె భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంజలి అంత్యక్రియలు ఇనుగుర్తి మండల కేంద్రంలో బుధవారం నిర్వహిస్తామని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.




జల్లులేనా..

నర్సంపేటలో కురుస్తున్న వర్షం

- ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షం
- భారీ వర్షాల కోసం ఎదురుచూపులు
- వానలేక ఎండుతున్న పత్తి మొక్కలు, వరి నారు
- నీటి తడి అందిస్తూ కాపాడుకుంటున్న రైతులు

# జోరువానలెప్పుడో



నర్సింహులపేట: నీరు లేక వాడిపోతున్న పత్తి మొక్క



స్టేషన్‌ఘన్‌పూర్: సముద్రాలలో పత్తి మొలకలకు నీరు పోస్తున్న రైతు



పాలకుర్తి: కోతులాబాద్‌లో పత్తి చేనుకు నీళ్లు కడుతున్న రైతు భిక్షపతి

నమస్తే నెట్‌వర్క్, జూన్ 24 : ఉమ్మడి జిల్లాలో మంగళవారం అక్కడక్కడా మోస్తరు వర్షం కురిసింది. హనుమకొండ, వరంగల్, ములుగు జిల్లాల్లో ఓ మోస్తరు వాన పడింది. భూపాలపల్లి జిల్లాలో చిరు జల్లులు కురిశాయి. మంగళవారం కురిసిన వర్షం పత్తి చేన్లకు కొంత ఊపిరినివ్వగా, వరి నాట్లు వేసే రైతులు మాత్రం భారీ వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. మే నెల చివరి వారంలో నే నైరుతి రుతుపవనాల పేరిట వర్షాలు దంచి కొట్టాయి. దీనికి తోడు వాతావరణ శాఖ సైతం రుతుపవనాల రాక ముందస్తుగా వచ్చిందని, ఈసారి రైతులకు పండుగేనని ప్రకటించింది. దీంతో ఉబ్బితబ్బిబ్బయిన రైతులు అందుబాటులో ఉన్న నీటి వనరులతో నారుమడులు పోసుకున్నారు. దీనికి తోడు ముందస్తుగానే దుక్కులు చేసుకొని పత్తి పంట వేసుకున్నారు. అయితే ముందుగా మురిపించిన వానలు తీరా కనుమరుగయ్యాయి. మే చివరి వారంలో కురిసిన వర్షా లు జూన్ చివరి దశకు చేరినప్పటికి పడలేదు. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. కురిసిన కొద్ది వానకు పత్తితోపాటు చిరుధాన్యాలైన కంది, పెసర, మక్కజొన్న పంటలు కూడా విత్తారు. 20 రోజులుగా చినుకు లేకపోవడంతో పాటు ఎండలు తీవ్రంగా ఉండడంతో భూమిలో విత్తిన విత్తనాలు, మొక్కలు ఎండిపోతున్నాయి. ఎండలు దంచి కొడుతుండడంతో దుక్కి తడారిపోతు న్నాయని, 15 రోజులుగా ఒక్కసారి కూడా వర్షం కురవలేదని అన్నదాత వాపోతున్నాడు. ఒకటీరెండు రోజుల్లో ఆశించిన వానలు కురవకపోతే నష్టపోతామంటున్నారు. కొందరు రైతులు పత్తి విత్తనాలు ఎండకు ఎండిపోకుండా నీరుపోస్తూ కాపాడుకుంటున్నారు.

## ఆ స్కూళ్లో ఒకే విద్యార్థి.. ఒకే టీచర్

**ఇదీ గ్రేటర్ వరంగల్‌లోని బొల్లికుంట ఎంపీపీఎస్ పాఠశాల పరిస్థితి**

ఖిలా వరంగల్, జూన్ 24: ఆధునిక విద్య, ప్రైవేటు పాఠశాలల పోటీ, మారుతున్న సామాజిక పరిస్థితుల మధ్య ప్రభుత్వ పాఠశాలలు తమ ఉనికిని కోల్పోతున్నాయి. ఈ కోవకు చెందినదే గ్రేటర్ వరంగల్ 17వ డివిజన్ బొల్లికుంటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల. ఒకప్పుడు ఒకటి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థుల ఆటపాటలతో నిండుగా ఉన్న పాఠశాల ప్రాంగణం నేడు నిశ్శబ్ధంగా కనిపిస్తున్నది. ఒకే విద్యార్థికి చదువు చెప్పేందుకు ఒకే ఉపాధ్యాయుడు ఉండడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. ఇదీ ఒక బొల్లికుంట స్కూలే కాదు జిల్లావ్యాప్తంగా పలు గ్రామీణ ప్రాంతాల్లో అక్కడక్కడ ఉన్న ప్రభుత్వ పాఠశాలల దీన గాథకు అద్దం పడుతోంది.



బొల్లికుంట స్కూల్‌లో చదువుతున్న విద్యార్థి